

హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 మంగళవారం 2 జనవరి 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY

## పాలమూరు విద్యార్థుల సాహితీ యాత్ర



పాల్కురికి సోమనాథుడి స్మృతివనం వద్ద విద్యార్థులు

పాలకుర్తి, జనవరి 1: మహాకవులు పాల్కురికి సోమన, బమ్మెర పోతన, వాల్మీకి మహర్షి నడయాడిన పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను మహబూబ్‌నగర్ జిల్లా వేముల పాఠశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. మహాకవుల గురించి పాఠ్యపుస్తకాల్లో చదవడమే తప్ప వారి స్వస్థలాల సందర్శనకు రావడం విశేషమని ప్రముఖ సాహితీవేత్త, పాఠ్యపుస్తక రచయిత పల్లెర్ల రామమోహన్‌రావు అన్నారు. పాలకుర్తిలోని సోమనాథుడి స్మృతివనం, బమ్మెరలోని పోతన మందిరం, వల్మిడిలోని శ్రీరాముడి ఆలయాలను విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, శంకరమంచి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు బీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# కొంగొత్త ఆశలతో..

**ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు**

**కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు, పార్కులు**

**వేయిస్తంభాల గుడి, భద్రకాళీ దర్శనానికి పోటెత్తిన భక్తులు**

**నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు**



వేయి స్తంభాల గుడిలో బారులు తీరిన భక్తులు



రామప్ప ఆలయంలో..



హనుమకొండ రెడ్డికాలనీలో న్యూ ఇయర్ ముగ్గు





భద్రకాళీ ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



కోటి ఆశలు, కొంగొత్త ఆలోచనలతో ఆంగ్ల నూతన సంవత్సరాదిని స్వాగతించిన ప్రజలు సోమవారం న్యూ ఇయర్ వేడుకలను అంబరాన్నంటేలా సంబురంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొని ఇళ్లల్లో, కాలనీల్లో చిన్నాపెద్దా అంతాకలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకొన్నారు. ఇళ్ల ముందువేసిన తీరొక్క రంగవల్లులు ఆకట్టుకున్నాయి. దీంతో ఎక్కడచూసినా నయా జోష్ కనిపించింది. కొత్త ఏడాది అంతా శుభం కలగాలని ఇష్టదైవాన్ని కోరుకుంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు కిటకిటలాడగా భద్రకాళీ, వేయిస్తంభాల గుడి, కాళేశ్వరం, రామప్ప ఆలయాల్లో ఉదయం నుంచే దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. దివ్య తేజస్సుతో ఉన్న భద్రకాళీ అమ్మవారిని దర్శించుకొని తరించారు. అలాగే చిన్నారుల ఆటపాటలతో కాకతీయ జూ పార్కు సహా పలు పార్కులు కళకళలాడాయి. అటు క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలతో చర్చిలు సందడిగా కనిపించాయి.

– నమస్తే నెట్‌వర్క్, జనవరి 1

## బైరి నరేశ్, అయ్యప్పస్వాముల వాగ్వాదం

**ఏటూరునాగారంలో ఉద్రిక్తత.. అయ్యప్ప భక్తుడిని ఢీకొట్టిన నరేశ్ కారు**

**వెంబడించిన అయ్యప్పస్వాములు.. తప్పించుకున్న నరేశ్.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



బైరి నరేశ్‌ను వెళ్లిపోవాలంటూ డిమాండ్ చేస్తున్న అయ్యప్ప భక్తులు



గాయపడిన అయ్యప్ప భక్తుడు నర్సింగారావు

ఏటూరునాగారం, జనవరి 1 : నాస్తికుడు బైరి నరేశ్, అయ్యప్ప స్వాముల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తతతకు దారితీసింది. ఈ క్రమంలోనే నరేశ్ కారు ఢీకొట్టడంతో ఓ అయ్యప్ప భక్తుడు గాయపడగా మిగతా భక్తులంతా కోపోద్రిక్తులయ్యారు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజా చైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరేశ్ హాజరయ్యారు. నరేశ్ గతంలో అయ్యప్పస్వామి, భక్తులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. నరేశ్ ఏటూరునాగారం వచ్చిన విషయం తెలుసుకున్న అయ్యప్పస్వాములు, భక్తులు అక్కడికి చేరుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. గతంలో అయ్యప్పస్వామిపై వ్యంగ్యంగా మాట్లాడడం, దేవుళ్లను కించపరిచేలా మాట్లాడిన నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావంటూ నిలదీసి వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అయ్యప్పస్వాములు, బైరి నరేశ్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. గతంలో తనపై ఇదే విషయమై కేసులు నమోదయ్యాయని, తాను అన్న మాటలను వెనక్కి తీసుకున్నానని, తనను క్షమించాలని అయ్యప్ప భక్తులను కోరారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లే క్రమంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ఫంక్షన్‌హాల్ నుంచి బయటకు వచ్చి తన కారులో నరేశ్ వెళ్తుండగా పోగు నర్సింగారావు అనే భక్తుడిని ఢీకొట్టగా కాలికి గాయమైంది. అయ్యప్ప భక్తులు అడ్డుకుంటుండగా ఆపకుండా వెళ్లడంతో కోపోద్రిక్తులైన అయ్యప్ప భక్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ బైరి నరేష్‌ను అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ కొందరు వెంబడించారు. ఈ క్రమంలో బైరి నరేశ్ కమలాపురం వైపు వెళ్తుండగా అటువైపు నుంచి వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు దిగి చెట్లల్లకు వెళ్లింది. కారులోని బెలూన్లు తెరుచుకోవడం తో నరేశ్‌తోపాటు అందులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. కారులో నుంచి బయటపడిన నరేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎస్సై కృష్ణప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, గాయపడిన నర్సింగారావును స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించారు.



నితిన్, భరత్‌చందర్ (ఫైల్)

## ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం

- **డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి**
- **హైదరాబాద్ పటాన్‌చెరు సమీపంలో ఘటన**
- **జనగామ జిల్లా అలింపూర్, రాఘవపురంలో విషాదం**

బచ్చన్నపేట/పాలకుర్తిరూరల్, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన హైదరాబాద్ నగరం పటాన్‌చెరు సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలింపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్ (20), పాలకుర్తి మండలం రాఘవపురం గ్రామానికి చెందిన రాగం భరత్‌చందర్(19) హైదరాబాద్‌లోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మరో స్నేహితుడు వంశీతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు సోమవారం తెల్లవారుజామున స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో నితిన్, భరత్ చందర్ అక్కడికక్కడే మృతి చెందారు. వంశీ తీవ్రంగా గాయపడడంతో చికిత్సకోసం దవాఖానకు తరలించారు. నితిన్, భరత్‌చందర్ మృతితో అలింపూర్, రాఘవపురంలో విషాదం నెలకొంది. నితిన్ తండ్రి పాకాల కిష్టయ్య ఏడాది క్రితం మృతి చెందగా, తల్లి సంతోష కూలి పనులు చేస్తూ చదివిస్తున్నది. రాగం భరత్‌చందర్‌కు ఇద్దరు అక్కలు. తల్లిదండ్రులకు ఇతనొక్కడే కొడుకు. భరత్‌చందర్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ఇదిలా ఉండగా నితిన్ కుటుంబ సభ్యులను సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ. మసూద్ పరామర్శించి సంతాపం తెలిపారు.

బియ్యం ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. రెండు, మూడు నెలల క్రితం వరకు మామూలుగానే ఉన్న ధరలు అమాంతం పెరగడంతో ఇబ్బందిపడుతున్నారు. దొడ్డు బియ్యం తినలేక, సన్నబియ్యం కొనలేక ఒక పూట పస్తులుండే పరిస్థితి దాపురించింది. గతంలో క్వింటాలు సన్న బియ్యానికి రూ.4వేల నుంచి రూ.4500 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.6వేల నుంచి రూ.7 వేల వరకు సామాన్యులు కొనలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బియ్యం ధరలను అదుపు చేసి, సామాన్యులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

– మహబూబాబాద్ , జనవరి 1 (నమస్తే తెలంగాణ)



# చుక్కలు చూపిస్తున్న సన్నబియ్యం

**నెల రోజుల్లో రూ. 800 నుంచి రూ.వెయ్యి పెరుగుదల**

**ఇబ్బందిపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు**

**ధరలను అదుపు చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు**

**అమాంతం పెరిగిన ధరలు.. రూ.6వేల నుంచి రూ.7వేల వరకు..**




బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. గత నెల రోజులతో పోలిస్తే ప్రస్తుతం బియ్యం ధరలు అమాంతం పెరిగి సామాన్యులు తినలేని దుస్థితి వచ్చింది. క్వింటాలుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు పెరగడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతేడాదితో పోలిస్తే పాత, కొత్త బియ్యానికి రెక్కలు వచ్చాయి. పెరిగిన బియ్యం ధరలతో రైతులు పండించిన ధాన్యానికి ధరలు విపరీతంగా పెరిగాయి. దేశంలో ఆహార గింజల కొరతతోపాటు యాసంగిలో వరి కోతల ముందు తుపాన్ ప్రభావంతో రైతుల ధాన్యం తడిసిపోయింది. దీనికి తోడు ఇతర రాష్ట్రాల్లో ధాన్యానికి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు ఎక్కువయ్యాయి. దీంతో బియ్యం ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఈ సీజన్లో గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2203, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,183 ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నది. ఇక ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలు ధాన్యానికి రూ.3100 నుంచి రూ.3200 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది వడ్ల వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి డబ్బులు ఇచ్చి మరి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మూడు నెలల క్రితం వరకు నార్మల్‌గా ఉన్న బియ్యం ధరలు ఒక్కసారిగా పెరగడంతో పేద ప్రజలకు ఎంతో ఇబ్బందిగా మారింది. ఏకంగా క్వింటాలుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. విజయమసూరి కొత్త బియ్యానికి క్వింటాలు రూ.4500 నుంచి రూ.4800 వరకు, పాత బియ్యానికి రూ.5800 నుంచి రూ.6200, ఆర్‌ఎన్‌ఆర్ బియ్యానికి కొత్త వాటికి రూ.5200 నుంచి రూ.5500 వరకు ఉండగా పాత బియ్యానికి రూ.6,500 నుంచి రూ.6,800 వరకు పెరిగింది. జై శ్రీరామ్ కొత్త బియ్యానికి రూ.6000 నుంచి రూ.6200 వరకు, పాత బియ్యానికి రూ.7500 నుంచి రూ.7800 వరకు ప్రస్తుతం ధరలు ఉన్నాయి. దీంతో సన్నబియ్యం కొనాలంటే జనం జంకుతున్నారు.

### క్వింటాకు రూ.2వేల వరకు పెరిగింది



గతంలో ఎప్పుడూ లేనివిధంగా బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. గతంలో సన్నబియ్యం క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.4,500వరకు ధర ఉండేది. ఈ ఏడాది రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ధర పలుకుతున్నది. అంటే సుమారు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ధర పెరిగింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పేద కుటుంబాలైతే సన్నబియ్యం తినే అవకాశం లేకుండా పోతున్నది. ప్రభుత్వం బియ్యం ధరలను అదుపు చేయకపోతే పేదలు మూడు పూటలా అన్నం తినే అవకాశం ఉండదు.

- మేరుగు శంకర్, ముంగిమడుగు



## కోడిగుడ్డు మస్తు పిరం

- **ఉత్పత్తి తగ్గడంతో పెరిగిన డిమాండ్**
- **కేసు ధర రూ.180 నుంచి రూ.200..**
- **ఒక్కో గుడ్డుకు రూ.7 నుంచి 8 వరకు పెంపు**
- **ఇబ్బంది పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు**

బయ్యారం/శాయంపేట, జనవరి 1: నిన్నామొన్నటి వరకు కోడి ధర చుక్కలు చూపించగా, ఇప్పుడు కోడి గుడ్డ మస్తు పిరమైంది. కానీ, కొద్దిరోజుల నుంచి గుడ్డ ధర చుక్కలు చూపిస్తున్నది. ధర పెరగడంతో సామాన్యులు తినడానికి ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నెలల కిందట కోడి గుడ్ల కేసు (30 కోడిగుడ్లు) రూ.120 నుంచి రూ.130 మాత్రమే ఉండేది. దీంతో రిటైల్ మార్కెట్‌లో రూ.5లకే గుడ్డు అమ్మేవారు. కానీ, కొన్ని రోజులుగా గుడ్ల ధర పెరుగుతూ వస్తున్నది. 15 రోజుల క్రితం కేసు ధర రూ.160 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.6కు విక్రయించారు. ప్రస్తుతం కేసు ధర రూ.180 నుంచి రూ.200 చేరడంతో రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి రూ.8 వరకు అమ్ముతున్నారు. ధర ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాగా, చలికాలం కావడంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిందని, మామూలు రోజులతో పోలిస్తే చలికాలంలో గుడ్ల ఉత్పత్తి 60 శాతం నుంచి 70 శాతానికి పడిపోతుందని కోళ్ల ఫాం యజమానులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండాకాలంతో పోలిస్తే చలి, వానకాలాల్లో గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం ఉండడంతో యజమానులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు ఆసక్తి చూపడం తదితర కారణాలతో గుడ్ల ధర పిరమైందని వ్యాపారులు చెబుతున్నారు.



పోచమ్మమైదాన్‌లో వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఏసీపీ భోజరాజు

## 180 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

పోచమ్మమైదాన్, జనవరి 1 : వరంగల్ నగరంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము 3గంటల వరకు పెట్రోలింగ్, వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఇందులో 180 మంది వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని, వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. న్యూ ఇయర్ సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకపోవడం సంతోషంగా ఉందని ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు పేర్కొన్నారు. పెట్రోలింగ్‌లో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కష్టపడి పనిచేశారని అభినందించారు.